క్లుప్తంగా

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫల పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు ఆలయం ఆవరణ లో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

మరణించి ఇద్దరికి కంటి వెలుగు


నేత్రాలను దానం చేస్తున్న సిమే విశ్వనాథ్ కుటుంబ సభ్యులు

ఆదోనిటౌన్: ఆదోని పట్టణం సంతపేటలో నివాసముంటున్న సిమే విశ్వనాథ్ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన కోరిక మేరకు భార్య పుష్పావతి, కుటుంబసభ్యులు నేత్రాలను దానం చేసేందుకు ముందుకొచ్చారు. సాయి జ్యోతి ఐ ఫౌండేషన్ వారికి సమాచారం అందించగా ఆ బృందం సభ్యులు వచ్చి నేత్రాలను సేకరించారు. మరణించినా ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపాలన్న ఆలోచనను ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

బాధితుడికి పరామర్శ


దాడిలో గాయపడిన వాటర్‌మెన్‌ను పరామర్శిస్తున్న ఎరుకుల రవి

ఆదోనిఅర్బన్: డివిజన్ పరిధిలోని పెద్దకడబూరు మండలం మేకడోన గ్రామంలో ఆదివారం దాడికి గురైన ఆర్‌డబ్ల్యూఎస్ అవుట్‌సోర్సింగ్ వాటర్ లైన్‌మ్యాన్ నరసయ్యను ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎరుకుల రవి సోమవారం పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడితో మాట్లాడి దాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్దకడబూరు ఎస్ఐతో మాట్లాడుతూ దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కోసిగి: మండల కేంద్రంలోని 9వ వార్డు మెంబర్ సన్నక్కి ఈరన్న తల్లి ఉలిగమ్మ (75) అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మాణిక్యరాజు, రాజేష్ మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆమె అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి సహకారంతో రూ.5 వేలు ఆర్థిక సాయం ఆ కుటుంబసభ్యులకు అందజేశారు.

శివరాత్రి ఉత్సవాలకు స్పెషల్ బస్సులు

ఆదోని సెంట్రల్: మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదోని డిపో నుంచి స్పెషల్ సర్వీసు బస్సులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ సోమవారం ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. శ్రీశైలం వెళ్లే భక్తుల సౌకర్యార్థం మార్చి 1వ తేదీ నుంచి 11వ తేదీ వరకు బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు రద్దీకి అనుగుణంగా వెంకటాపురం మీదుగా శ్రీశైలం వెళ్లే భక్తులకు స్పెషల్ సర్వీసులు 6వ తేదీ నుంచి శివరాత్రి ఉత్సవాల ముగింపు వరకు నడుపుతామని తెలిపారు. ప్రతి రోజు శ్రీశైలానికి 60 బస్సు సర్వీసులు, 8వ తేదీన రుద్రాభిషేకం, పాగాలంకరణ రోజున 79 బస్సు సర్వీసులను నడిపేలా ప్రణాళిక రూపొందించినట్లు వివరించారు. 60 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడి వస్తే వారికోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుత్ మోటార్ చోరీ

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని అటికెల గుండు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ మోటార్ చోరీకి గురైందని పాఠశాల హెచ్ఎం సుబ్రమణ్యం సోమవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాల ఆవరణలో ఉంచిన ఇటుకలను ఎత్తుకెళ్లినట్లుగా హెచ్ఎం ఫిర్యాదులో పేర్కొన్నారు.

అభివృద్ధికి సాక్ష్యాలు.. సచివాలయాలు



మాధవరం తండాలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఉప్పరహాల్‌లో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కౌతాళం: గ్రామాల్లో అభివృద్ధికి సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్‌లే నిదర్శనం అని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ వల్ల ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, విద్యా వ్యవస్థలో సంస్కరణల వల్ల పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన విద్య వెలకట్టలేని సంపద అని కొనియాడారు. పేద పిల్లలు సైతం ఇంగ్లిష్ చదువుకుని అంతర్జాతీయస్థాయిలో రాణించాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బడుల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టారన్నారు. మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామంలో రూ.1.68 కోట్లతో నిర్మించిన జెడ్పీ పాఠశాల గదులను, రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గ్రామ సర్పంచ్ తులసి, గ్రామ ఇన్‌చార్జ్ ఏకాంబర్ రెడ్డితో కలిసి సోమవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ల లాంటివని, ఈ ఐదేళ్ల పాలనలో ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పథకాలు అందించినట్లు వివరించారు. ప్రజల కోసం పని చేసే ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఉప్పరహాల్ గ్రామానికి ప్రత్యక్ష ప్రయోజనాల ద్వారా రూ.12.81 కోట్లు అందించినట్లు వివరించారు. అలాగే పరోక్ష ప్రయోజనాల ద్వార రూ.4.11 కోట్లు ఖర్చు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామంలో ప్రతి వీధిలో సిమెంటు రోడ్డు వేశామన్నారు. ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా, ఎంఈఓ శోభరాణి, కార్యదర్శి అబ్దుల్‌వాహిద్, వీఆర్‌ఓ పాపమ్మ, ఎంపీపీ అమరేష్, సర్పంచ్ పాల్‌దినకర్, భీమ్‌రెడ్డి, వెంకటరామిరెడ్డి, సీఐ ప్రసాద్, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే అభివృద్ధి

మంత్రాలయం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగనన్న పరిపాలనలో మెరుగైన అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి అన్నారు. మంత్రాలయం మండలం మాధవరం తండాలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు జి.భీమారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసి ప్రజల గుండెల్లో నిలిచాడన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలతో అధికారం చేపట్టి మేనిఫెస్టోను కూడా మాయం చేశారని విమర్శించారు. సొంతంగా పోటీ చేసి గెలవలేమన్న భయంతో ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకుని మరోసారి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. ఎన్ని పార్టీలతో పొత్తు పెట్టుకుని వచ్చినా జగనన్న చేసిన అభివృద్ధే మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఇళ్ల పత్రాలు పంపిణీ చేశారు. ఎంపీడీఓ మున్నెప్ప, ఎస్ఐ కృష్ణమూర్తి, పీఆర్‌డీఈ అశ్వత్థామ, ఏఈ నరసింహులు, ఏడీఏ మహ్మద్ ఖాద్రి, ఏఓ జీరా గణేష్, డాక్టర్ సురేష్, వీఆర్వో నవ్య, సర్పంచ్ లక్ష్మీబాయి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద నివారించాలి

ఆదోనిఅర్బన్: పట్టణంలో వీధికుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని పురపాలక అధికారులకు బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు మలేకర్ శ్రీనివాసులు, అసెంబ్లీ కో-కన్వీనర్ నాగరాజ్‌గౌడ్ కోరారు. స్థానిక కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం వెంకన్న పేటకు చెందిన కేదార్నాథ్ అనే నాలుగేళ్ల బాలుడు రేబిస్ లక్షణాలతో మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రతి వీధిలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయన్నారు. వాటిని నియంత్రించాలని కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు లోకేష్‌కుమార్, నాయకులు శ్రీనివాస్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో పదో తరగతి హాల్‌టికెట్లు

తుగ్గలి: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని ఎంఈఓ-2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులు వారి పాఠశాల లాగిన్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని విద్యార్థులకు అందజేయాలన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు కూడా స్ట్రీమ్, పాఠశాల పేరు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీని సబ్మిట్ చేసి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు


ఇంటింటి సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కోసిగి: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం రెండవ రోజు కొనసాగింది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో హెల్త్ అసిస్టెంట్స్, సూపర్ వైజర్స్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు ఇంటికి వెళ్లి ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయించారు. మండలంలో 13,611 ఇళ్లకు గానూ 10,526 ఇళ్లను సందర్శించి సోమవారం 190 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించినట్లు వైద్యాధికారి మనోజ్‌కుమార్ తెలిపారు. 77 శాతం ఇళ్లు సందర్శించగా మిగిలిన ఇళ్లను నేడు పూర్తిచేసి కార్యక్రమాన్ని వంద శాతం విజయవంతం చేస్తామన్నారు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ


హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న శాన్వాజ్ అలీకి పింఛన్ అందిస్తున్న వలంటీర్ కంచి త్రివేణి


21వ వార్డులో హరి ప్రణీత్‌కు పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ సెక్రటరీ రవికుమార్

ఆదోనిటౌన్: ఆదోని పట్టణం 20వ వార్డు సాయిబాబా నగర్‌కు చెందిన శాన్వాజ్ అలీకి డయాలసిస్ నిమిత్తం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా వలంటీర్ కంచి త్రివేణి సోమవారం అక్కడికే వెళ్లి రూ.10 వేలు పింఛన్ అందజేశారు. హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి వచ్చి పింఛన్ అందించడం పట్ల శాన్వాజ్ అలీ తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అలాగేఉ పట్టణంలోని 21వ వార్డులో హరి ప్రణీత్‌కు వికలాంగుల పెన్షన్‌ను వెల్ఫేర్ సెక్రటరీ రవికుమార్ పంపిణీ చేశారు.

కర్ణాటక మద్యం పట్టివేత


నిందితుల అరెస్టును చూపుతున్న ఎస్ఐ నరేంద్ర

హాలహర్వి: మండలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో ఏపీ 21 బీడీ 4256 నంబర్ గల ద్విచక్ర వాహనంలో అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న విరుపాపురం గ్రామానికి చెందిన బిపి కాళింగను మండలంలోని కోగిలతోట క్రాస్ వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. నిందితుడి వద్ద నుండి 384 హైవార్డ్ విస్కీ 90 ఎంఎల్ మద్యం టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. తనిఖీల్లో విజయ్, రంఘుస్వామి, అయ్యప్ప స్వామి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నాగులదిన్నె పోలీస్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించామన్నారు. గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన మాదిగ లక్ష్మన్న కర్ణాటక మద్యం తలిరలిస్తుడంగా పట్టుకుని 288 జాన్స్ ఒరిజినల్ చాయస్ విస్కీ (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

హొళగుంద: పెద్దగోనెహాళ్ గ్రామంలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పెద్దయ్యనాయుడు సోమవారం తెలిపారు. సదరు వ్యక్తి కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం టెట్రా ప్యాకెట్లను తీసుకొచ్చి గ్రామంలో విక్రయించేందుకు వాముదొడ్డిలో దాచి ఉంచినట్లు చెప్పారు. దాడులు నిర్వహించి నిందితుడి నుంచి 288 మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామని, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

పండ్ల తోటల సాగుకు ప్రోత్సాహం


మాట్లాడుతున్న ఏపీడీ జి.అల్లీపీరన్

ఎమ్మిగనూరురూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జి.అల్లీపీరన్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై ఈసీ, టీఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. వ్యవసాయ కూలీలు వలస వెళ్లకుండా ఉన్న ఊర్లో ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫారం ఫాండ్స్, మినీ అమృతసర్, డకౌట్స్, పండ్ల తోటల పెంపకం వంటివి చేపడుతున్నామన్నారు. పండ్ల తోటల సాగు చేపట్టేలా ప్రతి గ్రామంలో రైతులను ప్రోత్సహిస్తున్నామని, వంద శాతం సబ్సిడీ ఇస్తామని తెలిపారు. ఏపీఓ విజయమోహన్, క్లస్టర్ టీఏ బషీర్, టీఏలు తదితరులు పాల్గొన్నారు.

శివస్వాముల సాక్షిగా ఒక్కటైన జంటలు


ఆలయంలోకి వెళుతున్న నూతన జంటలు, బంధువులు

హొళగుంద: మండల పరిధిలోని కోగిలతోట గ్రామంలో సోమవారం సామూహిక వివాహాల కార్యక్రమం వైభవంగా జరిగింది. శివదీక్ష తీసుకున్న స్వాములు, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరు నూతన జంటలు ఒక్కటయ్యాయి. వధువరుల బంధువులు, కుటుంబ సభ్యులతో పాటు గ్రామపెద్దలు, ప్రముఖులు, హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమానికి హాజరైన వారికి భోజన సౌకర్యం కల్పించారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విరూపాక్షి వధూవరులను ఆశీర్వదించారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించండి


అర్జీలను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ


శంకర్‌నగర్ కాలనీలో ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ రామచంద్రారెడ్డి

ఆదోనిరూరల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు అర్జీలను రెఫర్ చేస్తూ గడువు లోపు పరిష్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

మండలాల నుంచి వచ్చిన అర్జీల్లో కొన్ని..

- ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామానికి చెందిన రామలక్ష్మికి సర్వే నంబర్ 310లో ఎకరం భూమి కొనుగోలు ద్వారా సంక్రమించింది. సదురు భూమికి పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.
- ఎమ్మిగనూరు మండలం పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన బడ్డన్నకు సర్వేనంబర్ 530లో 0.45 సెంట్ల భూమి ఉంది. ఈ భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదైందని, విచారణ జరిపి న్యాయం చేయాలని అర్జీ ఇచ్చారు.
- ఆదోని మండలం మాంత్రికి గ్రామానికి చెందిన రాముడుకు కౌతాళం మండలం ఉరుకుంద గ్రామంలో సర్వే నంబర్ 302/డి నందు 0.99 సెంట్ల భూమి పెద్దల నుంచి సంక్రమించింది. సదరు భూమి ఆన్‌లైన్‌లో ఇతరుల పేరిట నమోదై ఉందని, తనకు న్యాయం చేయాలని అర్జీ సమర్పించారు.

కార్యాలయ పరిపాలన అధికారి శేషయ్య, సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ వేణు సూర్య, శ్రీనివాసరాజు, డీఎల్‌పీఓ శ్రీనివాస, గృహనిర్మాణ శాఖ డీఈ రవి కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, ఆర్డీఓ నాగేంద్ర, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ చేతన్ ప్రియ, ఉప తహసీల్దార్ వలిబాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం

ఆదోనిటౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని పురపాలక కమిషనర్ రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రశాంత్ నగర్‌కు చెందిన మహబూబ్ బాషా పట్టణంలోని అక్రమ కట్టడాలను తొలగించాలని అర్జీ సమర్పించారు. పట్టణంలోని క్రైస్తవ శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మించాలని పాస్టర్ ఆనందరాజు వినతి పత్రం ఇచ్చారు. శివారు కాలనీల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా కాలనీవాసులు కొందరు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టణంలోని శంకర్‌నగర్, కల్లుబావి ప్రాంతంలో కలియతిరిగి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడుతామన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం

కౌతాళం: 'మేము సిద్ధం - మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని కౌతాళంలో సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మండల పార్టీ కన్వీనర్ ప్రహ్లాదాచారి అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయనతోపాటు మండల సచివాలయాల కన్వీనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో ఒక్కొక్క పోలింగ్ బూత్ వారీగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ఒక పోలింగ్ బూత్‌కి ఒక అధ్యక్షుడిని, ముగ్గురు కోర్ కమిటీ మెంబర్లను ఎన్నుకోవాలన్నారు. అనంతరం గృహసారథులు వలంటీర్లు కలిసి బూత్ కమిటీగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కమిటీ ప్రతిరోజు 5 నుంచి 10 ఇళ్లను సందర్శించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచిని వివరించి పార్టీకి ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఎన్నికలు అయ్యే వరకు ఈ ప్రక్రియను నిరంతరంగా చేపట్టాలన్నారు. సర్పంచ్ పాల్‌దినకర్, మాజీ సర్పంచ్ అవతారం, నాయకులు దాట్ల సుబ్బారాజు, రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ లక్షణాలతో చిన్నారి మృతి


కేదార్నాథ్ (ఫైల్)

ఆదోనిఅర్బన్: ఏం జరిగిందో తెలియదు. శరీరంపై ఒక్కచోట కూడా కుక్క గాట్లు లేవు. రెండు రోజుల ముందు తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు అన్ని పరీక్షలు చేసి రేబిస్ లక్షణాలు ఉన్నాయని నిర్ధారించారు. వెంటనే కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా కోలుకోలేక నాలుగేళ్ల బాలుడు కేదార్నాథ్ మృతి చెందినట్లు తండ్రి సురేష్ తెలిపారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వెంకన్న పేట కాలనీకి చెందిన సురేష్, లక్ష్మీ దంపతలు కుమారుడు కేదార్నాథ్ (4)ను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. బాలుడు అనారోగ్యానికి గురికావడంతో మంగళవారం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బుధవారం బాలుడు మృతి చెందాడు. ఆ ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కలు పొట్లాడుకోవడం, తుమ్మడం వల్ల ఎంగిలి పడడంతో బాలుడికి ఆ విధంగా వ్యాధి సోకిందేమోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుక్కల బెడద నుంచి అధికారులు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ విస్తృత తనిఖీలు

కోసిగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, నారాయణ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష జరిగింది. రెండు కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ ఇంగ్లిష్ పరీక్షకు 319 మంది విద్యార్థులకు గానూ 185 మంది హాజరుకాగా, 134 మంది గైర్హాజరైనట్లు ఆ కళాశాల పరీక్ష చీఫ్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే నారాయణ కళాశాలలో 298 మందికి గానూ 283 మంది హాజరుకాగ 15 మంది గైర్హాజరైనట్లు కళాశాల పరీక్షల చీఫ్ ఉదయ్ భార్గవ్ తెలిపారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే మాస్ కాపీయింగ్ జరగకుండా సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ విధానం ఏర్పాటు చేశారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సమీరారెడ్డి

కోసిగి: ఈనెల 18వ తేదీ నుంచి జరుగబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేసి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ నాగేశప్ప సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండంలోని వివిధ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేయించేలా చూడాలని ఆమె కోరారు. మోడల్ స్కూల్లో 100 సీట్లు ఉన్నాయని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అలాగే ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ తదితర మౌళిక వసతులు ఉండేలా సరిచూసుకోవాలని నాడు-నేడు ఏఈ రంగరాజుకు ఆదేశించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు హంద్రీ నది నుంచి ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సెబ్ పోలీసులు పట్టుకున్నారు. వర్కూరుకు చెందిన రాముడు, సుంకన్నలకు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ రామాంజనేయులు సోమవారం తెలిపారు. అక్రమంగా హంద్రీ నుంచి ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

600 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు రూరల్: సెబ్ పరిధిలోని క్రిష్ణగిరి మండలం కర్లకుంట గ్రామ శివారులో శివన్న అనే వ్యక్తి గుట్టుచప్పుడు కాకుండా నాటు సారా తయారు చేస్తున్నాడు. సోమవారం సెబ్ పోలీసులు దాడి చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు సెబ్ పోలీసులు వెంకటేష్ నాయక్, అప్రోజ్‌బాషా, శంకర్ నాయక్, విరుపాక్షిరెడ్డి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువనాయకుడు జయమనోజ్ రెడ్డి

ఆదోని సెంట్రల్: పేదల అభ్యున్నతికి ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు జయమనోజ్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 32వ వార్డు కౌన్సిలర్ కీర్తన, 2వ వార్డు కౌన్సిలర్ సురేష్‌తో కలసి లబ్ధిదారులు ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి వారు ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా, చేదోడు, చేయూత, అమ్మ ఒడి తదితర పథకాలతో ఎంతగానో ఆదుకున్నట్లు తెలిపారు. ఇళ్లు లేని వారిని ఇంటిపట్టాలు ఇచ్చి ప్రస్తుతం వాటిని రిజిస్టర్ చేసి ఇవ్వడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం 32వ వార్డులోని 175 మందికి, రెండవ వార్డులోని 150 మందికి రిజిస్టర్ పత్రాలను పంపిణీ చేశారు. గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌకర్యవంతంగా సీసీ రోడ్డు


నాడు - రోడ్డు లేక అధ్వానం


నేడు - సీసీ రోడ్డు నిర్మించడంతో సౌకర్యవంతం

కోసిగి: మండల కేంద్రంలోని ఎన్టీఆర్, శ్రీరామనగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు కింద రూ.20 లక్షలతో డ్రయినేజీ, సీసీ రోడ్డు నిర్మించారు. నాడు కాలనీలో రోడ్డు వసతి లేక వీధిలో కంకరతేలి, గుంతలమయంగా ఉండేది. డ్రయినేజీ నీళ్లు రోడ్డుపై నిలిచేవి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీ వాసులు రోడ్డు వేయించాలని విన్నవించగా ఆయన సానుకూలంగా స్పందించారు. గడప గడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన నిధులతో కాలనీల్లో ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు చేయించారు. ప్రస్తుతం రోడ్డు అందుబాటులోకి రావడంతో కాలనీ సుందరంగా తయారైంది. దీంతో కాలనీవాసులు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌ఛార్జ్ పి.మురళీమోహన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.